


జోర్దార్‌గా జగ్గారెడ్డి జన్మదిన వేడుకలు



● డప్పు చప్పుళ్లు, డిజే సౌండ్లతో హోరెత్తిన సంగారెడ్డి

సంగారెడ్డి టౌన్, జూలై 8 : టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు సంగారెడ్డిలో జోర్దార్‌గా జరిగాయి. సాయంత్రం పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్దకు వచ్చిన జగ్గారెడ్డిని అభిమానులు, కార్యకర్తలు, భారీ ర్యాలీతో సంగారెడ్డి పట్టణంలోకి తీసుకువచ్చారు. అక్కడి నుంచి నాల్సాబ్‌గడ్డ వరకు అడుగడుగునా అభిమానులు, కార్యకర్తలు జగ్గారెడ్డికి నీరాజనాలు పలికారు. గజమాలలు, పూలమాలలతో ముంచెత్తారు. శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డప్పుల చప్పుళ్లు, బ్యాండు మేళాలతో, టపాసుల పేలుళ్లతో, జగ్గారెడ్డిపై ప్రత్యేకంగా రూపొందించిన డిజే సౌండ్ పాటలతో సంగారెడ్డి పట్టణం మార్మోగింది.

















ఆశల పల్లకిలో.. ఆశావహులు

- జోగిపేట 'మార్కెట్' పీఠంపై పలువురి కన్ను
- మంత్రి ఆశీస్సుల కోసం ప్రయత్నాలు

జోగిపేట, జూలై 8 : మంత్రి దామోదర రాజనర్సింహా ప్రాతినిధ్యం వహిస్తున్న అందోలు నియోజకవర్గంలోని జోగిపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గిరిపై పలువురు నేతలు కన్నేశారు. ఎవరికి వారు పీఠం రేసులో నేనంటే నేనంటూ పావులు కదుపుతున్నారు. మంత్రి ఆశీస్సులు ఎవరికి ఉంటే వారికి పదవి దక్కే అవకాశం ఉండగా, ఆయన కరుణ కోసం ఎదురు చూస్తున్నారు.

జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఓసీ(జనరల్)కు రిజర్వ్ అయింది. దీంతో ఆశావహుల సంఖ్య అమాంతం పెరిగింది. అందోలు మండలం నుంచి సీనియర్ నాయకుడు మక్త జగన్మోహన్‌రెడ్డి (నేరడిగుంట), జీఆర్ మధుసూదన్‌రెడ్డి(డాకూరు), అక్సాన్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ జీఆర్ నరేందర్‌రెడ్డి(డాకూరు)తోపాటు పటోల్ల ధనంజయరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ స్థానాన్ని దక్కించుకునేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పుల్కల్ మండలం నుంచి సైతం ఒకరు పోటీలో ఉన్నట్లు సమాచారం. ఇందులో మక్త జగన్మోహన్‌రెడ్డి మంత్రి దామోదరకు ప్రధాన అనుచరుడిగా పేరుంది. మూడు దశాబ్దాలుగా నేరడిగుంట సర్పంచ్‌గా, స్కోర్(రెస్కో) డైరెక్టర్‌గా, సీడీసీ డైరెక్టర్ పదవులను నిర్వహించారు. జీఆర్ మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గ సీనియర్ నాయకుల్లో ఒకరైన దివంగత జీఆర్ క్రిష్ణారెడ్డికి విశ్వాసపాత్రుడిగా పేరుంది. ప్రత్యక్ష రాజకీయాల్లో పెద్దగా లేకున్నా... క్రిష్ణారెడ్డి కన్నుమూసిన తర్వాత గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన తెరపైకి వచ్చారు. అక్సాన్‌పల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘం అధ్యక్షుడు జీఆర్ నరేందర్‌రెడ్డి కూడా ఆశావహుల్లో ఉన్నారు. రెండు టర్మ్‌లుగా సొసైటీ చైర్మన్‌గా పని చేస్తున్నారు. రోళ్లపహాడ్‌కు చెందిన యువనాయకుడు పట్లోల్ల ధనుంజయరెడ్డి కొన్నేళ్లుగా మంత్రి దామోదర, ఆయన కుమార్తె త్రిషకు ప్రధాన అనుచరుడిగా ఉన్నారు. దామోదరకు పదవి లేని సమయంలో కూడా వెన్నంటి ఉన్నారు. వీరంతా మంత్రి దామోదరకు దగ్గర వారు కావడంతోపాటు ఎవరికి వారు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఏకాభిప్రాయంతో రండి..

నామినేటెడ్ పదవుల విషయంలో మంత్రి దామోదర్ స్పష్టమైన అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. నాయకుల, కార్యకర్తల అభీష్టం మేరకే పదవులు ఇస్తానని చెప్పినట్లు సమాచారం. ఏకాభిప్రాయంతో వస్తే పదవులు వస్తాయని అన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని అందోలు, పుల్కల్, చౌటకూరు, టేక్మాల్ మండలాలకు చెందిన నాయకులను పిలిపించుకుని మాట్లాడినట్లు చెబుతున్నారు. జోగిపేట మార్కెట్ చైర్మన్‌గిరి కోసం పలువురు పోటీ పడుతున్న నేపథ్యంలో మంత్రి దామోదర మనసులో ఏముందో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

మహిళా శక్తి మీ సేవ సెంటర్ల ఏర్పాటును నిలిపివేయాలి

- కలెక్టర్ కార్యాలయం వద్ద మీ సేవ నిర్వాహకులు నిరసన

సిద్దిపేట అర్బన్, జూలై 8 : మహిళా శక్తి పేరిట మహిళలకు గ్రామాల్లో మీసేవ కేంద్రాలను కేటాయించడాన్ని వ్యతిరేకిస్తున్నామని సిద్దిపేట మీసేవ నిర్వాహకులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా ఛార్జీలు పెంచమని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకున్నా సేవలు అందిస్తున్నామని, ప్రస్తుతం ప్రభుత్వం గ్రామాల్లో మీ సేవ కేంద్రాలు కేటాయించడం వల్ల తాము నష్టపోతామని వాపోయారు. రెండు సంవత్సరాలుగా కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇచ్చామని, కలెక్టర్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా రావాల్సిన డబ్బును అందజేయాలని కోరారు. జిల్లాలోని ఉన్న మీసేవ కేంద్రాలకు ఒక్కోదానికి సుమారుగా రూ.30 నుంచి 40 వేల రూపాయలు రావాలని, త్వరగా విడుదల చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గందే నాగరాజు, మద్దికుంట శ్రీకాంత్, నగేష్, నవీన్, భరత్, కిరణ్ మీసేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మీ సేవ నిర్వాహకులు

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

- గిరిజనులతో అటవీ శాఖ అధికారుల సమావేశం


గిరిజనులతో మాట్లాడుతున్న అటవీ అధికారులు

శివ్వంపేట, జూలై 8 : అటవీ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, సెక్షన్ ఆఫీసర్లు కిరణ్, సత్యనారాయణ తెలిపారు. మండల పరిధిలోని సీతారాం తండాలో నర్సాపూర్, తూప్రాన్ రేంజ్ పరిధిలోని అటవీ భూములు ఆక్రమణకు గురవుతుండడంతో సోమవారం రైతులతో అటవీశాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా అడవుల్లోకి ప్రవేశించి చెట్లను నరికి అటవీ భూములను దున్నితే నూతన చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని గిరిజనులను హెచ్చరించారు. కాగా ట్రిబుల్‌ఆర్‌లో భూములను కోల్పోతున్న పేద గిరిజన కుటుంబాలు దున్నుకోవడానికి ప్రభుత్వ భూమిని చూపించాలని అటవీ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూములు పొందడానికి గౌరవ జిల్లా కలెక్టర్ గారికి దరఖాస్తు చేసుకోవాలని అటవీశాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో కలీం, బీట్ ఆఫీసర్లు, చిరంజీవి, భరత్, గోపాల్ రెడ్డి, కుమార్ ఉన్నారు.

వానమ్మా వానమ్మా ఉయ్యాలో..

మర్కుక్, జూలై 8 : వరుణదేవా ఇకనైనా కరుణించవా, వానమ్మా వానమ్మా ఉయ్యాలో ఒక్కసారన్నా కురవమ్మో ఉయ్యాలో అంటూ సోమవారం మండల పరిదిలోని నర్సన్నపేట గ్రామంలో మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ వాన దేవుడిని ప్రార్థించారు. గ్రామంలోని కూడలి దగ్గర నిర్మించిన బొడ్రాయికి జల్ల కడవలతో జలాభిషేకం చేశారు.


జల్లకడవలతో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కాలుష్యం వెదజల్లుతున్న కర్మాగారం

- కలుషితమవుతున్న భూగర్భజలాలు
- పట్టించుకోని అధికారులు


దెబ్బతిన్న పత్తి పంట

ఝరాసంగం, జూలై 8: మండల పరిధిలోని కుప్పానగర్ శివారులో ఏర్పాటు చేసిన ఓ రసాయన కర్మాగారం వెదజల్లుతున్న కాలుష్యం వల్ల భూగర్భజలాలు కలుషితమవుతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ కర్మాగారం ప్రారంభానికి ముందు నుంచే స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. అయినా, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు కర్మాగారం యాజమాన్యం ఆడింది ఆట పాడింది పాటగా మారింది. కర్మాగారం యాజమాన్యం వర్షాలు పడిన సమయంలో గుట్టు చప్పుడు కాకుండా దిగువన ఉన్న గుండం చెరువులోకి రసాయన వ్యర్థాలను వదలుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఆ నీటిని మూగ జీవాలు తాగలేని పరిస్థితి నెలకొంది. అలాగే, భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు సాగు చేసిన పంటలూ ఎదగడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ వచ్చే దుర్వాసనతో చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారని అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కర్మాగారం నుంచి వ్యర్థాలు బయటకు రాకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.

హాస్టల్ భవనం పైనుంచి
దూకిన విద్యార్థిని

- తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

రాయికోడ్, జూలై 8: గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని హాస్టల్ రెండో అంతస్తు నుంచి దూకి తీవ్ర గాయాల పాలైంది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల హాస్టల్‌లో సోమవారం జరిగింది. ఈ పాఠశాలలో మల్లేశ్వరి (15) పదో తరగతి చదువుతోంది. సోమవారం ఆమె హాస్టల్ రెండో అంతస్తుపై నుంచి ఒక్కసారిగా దూకడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆమెను వెంటనే జహీరాబాద్ ఆస్పత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాలిక మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతోనే ఆమె భవనంపై నుంచి దూకిందని హాస్టల్ సిబ్బంది చెబుతుండగా, బాలిక కుటుంబీకులు మాత్రం ఎవరో పైనుంచి తోసేశారని చెబుతున్నారు. జిల్లా అధికారి భీమయ్య హాస్టల్‌ను సందర్శించి, విచారణ చేపట్టారు.

వాహన తనిఖీల్లో పట్టుబడిన
బోరు మోటార్ దొంగలు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్

దౌల్తాబాద్, జూలై 8 : మండల పరిధిలోని ఉప్పరపల్లి శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా బోరు మోటార్ నిందితులు పట్టుబడ్డారు. సోమవారం దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్‌ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గువ్వలేగి గ్రామానికి చెందిన బోయిని భిక్షపతి ఇంటి ఎదుట ఉన్న బోరు మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు 4న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం ఉదయం మండల పరిధిలోని ఉప్పరపల్లి శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై బోర్ మోటారును తీసుకుని రామయంపేట వైపు వెళ్తుతుండగా పోలీసులకు అనుమానం వచ్చి విచారించగా దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. డి.ధర్మారం గ్రామానికి చెందిన ముగ్గురు నిందితులు బొడ్డు స్వామి, బొడ్డు లక్ష్మీనర్సయ్య, పోసాన్‌పల్లికి చెందిన అబ్రమైన సత్తయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బంగార ఆభరణాల చోరీ కేసును
ఛేదించిన పోలీసులు

శివ్వంపేట, జూలై 8 : ఐదు రోజుల క్రితం సికింద్లాపూర్‌లో ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీ చేసిన నిందితుడిని పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తూప్రాన్ సీఐ రంగ కృష్ణ వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ జీడిమెట్ల ప్రాంతానికి చెందిన నిందితుడు కల్లే మహేష్ మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామంలో ఈనెల 3న దొంతికే మహేష్ ఇంట్లోని బీరువాను ధ్వంసం చేసి తొమ్మిది తులాల బంగారు ఆభరణాలను అపహరించాడు. నిందితుడిని పట్టుకుని అతడిని నుంచి ఆభరణాలు రూ.వేయి నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రంగకృష్ణ తెలిపారు. అతడు గతంలో 23 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.50 వేల విలువైన
గుట్కా ప్యాకెట్లు స్వాధీనం


నిందితుడిని చూపుతున్న పోలీసులు

వర్గల్, జూలై 8 : వర్గల్ మండలం గౌరారంలో సోమవారం ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లను టాస్క్‌ఫోర్స్, గౌరారం పోలీసులు పట్టుకున్నారు. గౌరారం గ్రామంలో దోసపాటి మహేష్ కుమార్ కిరాణ దుకాణంలో ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు విక్రయిస్తున్నడన్న సమాచారం మేరకు సిదిపేట టాస్క్‌ఫోర్స్, గౌరారం పోలీసులు కలిసి కిరాణ దుకాణానికి చేరుకుని తనిఖీలు చేశారు. బాక్స్‌లలో దాచి ఉంచిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. మహేష్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడైన అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, నిల్వ చేసినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రభుత్వం నిషేధించిన గుట్కాపై జిల్లా వ్యాప్తంగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహించినట్లయితే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారుల ఫోన్ నంబర్లు 8712667445, 8712667446, 8712667447కు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి పేరు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంలో రైతు మృతి

అక్కన్నపేట, జూలై 8 : పొలంలో ఓ రైతు బోరుమోటారు విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా కరెంటు షాక్‌తో మృతిచెందిన సంఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కన్నపేట మండలం పంతులుతండా గ్రామపంచాయతీ హెమసింగ్ తండాకు చెందిన రైతు భూక్య శివలాల్‌నాయక్(50) తన వ్యవసాయ బోరు వద్ద విద్యుత్ సరఫరా కావడం లేదని మరమ్మత్తులు చేస్తుండంగా ఒక్కసారిగా కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. శివలాల్‌కు భార్య దేవితో పాటు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ విషయంపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పోలీసులు తెలిపారు.

పదవులొచ్చాయ్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తొలిసారిగా పదవుల పంపకం మొదలైంది. ఈ మేరకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్లకు చైర్మన్లను నియమిస్తూ అధికారిక ఉత్తర్వులను వెలువరించారు. మూడు నెలల క్రితమే దీనికి సంబంధించి ప్రకటన వచ్చినప్పటికీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా ఉత్తర్వులు అమల్లోకి రాలేదు. స్వల్ప మార్పులు చేర్పులతో సోమవారం తుది జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలో ఉమ్మడి జిల్లాకు మూడు పదవులు దక్కగా వీరంతా కూడా సంగారెడ్డి జిల్లాకు చెందిన నేతలే కావడం గమనార్హం. రెండేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగుతారు. సిద్దిపేట, మెదక్ జిల్లాల ఆశావహులకు నిరాశ తప్పలేదు.

- ముగ్గురికి కార్పొరేషన్ పోస్టులు
- 3 నెలల క్రితమే ప్రకటన.. తాజాగా ఉత్తర్వులు
- సంగారెడ్డి జిల్లా వాసులనే వరించిన పీఠాలు
- సిద్దిపేట, మెదక్ జిల్లాల నేతలకు 'నో ఛాన్స్'
- రెండవ జాబితా కోసం ఆశావహుల ఎదురుచూపు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 8: నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ నేతలు గంపెడాశలు పెట్టుకున్న నేపథ్యంలో తొలి జాబితా చర్చనీయాంశంగా మారింది. మూడు నెలల కిందటే జాబితాను ప్రకటించగా పలు అభ్యంతరాలు వచ్చాయి. అయితే దశలవారీగా పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తామని కాంగ్రెస్ ముఖ్యనేతలు హామీ ఇవ్వడంతో సద్దుమణిగారు. పాత పదవులతోపాటు కొత్త పదవులను జోడించి జంబో జాబితా విడుదల చేస్తారని అంతా భావించారు. కానీ 35 మందికి మాత్రమే అవకాశాలు దక్కాయి. ఇందులో సంగారెడ్డి జిల్లా నేతలు ముగ్గురు ఉన్నారు.

నిర్మలాజగ్గారెడ్డికి 'పారిశ్రామిక సంస్థ'

సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి సతీమణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డికి కీలకమైన పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆమె స్టాఫ్ నర్సుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి రాజకీయ అరంగేట్రం చేశారు. భర్త జగ్గారెడ్డి ఆశయాల్లోనూ భాగస్వామిగా తనవంతు పాత్ర నిర్వహిస్తున్నారు. డీసీసీ అధ్యక్షురాలిగా పార్టీ బలోపేతానికి కృషి చేశారు. గడిచిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ సంగారెడ్డి నియోజకవర్గంలో అత్యధిక ఓట్లు సాధించడంలో జగ్గారెడ్డి కీలకపాత్ర పోషించారు. పారిశ్రామికంగా విస్తరించిన జిల్లాకు ఈ పదవి దక్కడంతో పరిశ్రమల అభివృద్ధి సాకారమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



నిర్మలాజగ్గారెడ్డి

ఫహీంకు ఫుడ్ కార్పొరేషన్

పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన ఎం.ఏ ఫహీంకూ తొలి జాబితాలోనే చోటు దక్కింది. టీడీపీ అనుబంధ విద్యార్థి విభాగం టీఎన్ఎస్ఎఫ్ ద్వారా 2004లో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి ఆ పార్టీకి రాష్ట్ర కార్యదర్శిగా విధులు నిర్వహించారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేశారు. 2014లో కాంగ్రెస్‌లో చేరి రాష్ట్ర అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా, కమ్యూనికేషన్ విభాగం ఇన్‌చార్జిగా కీలక స్థానాల్లో కొనసాగుతూ వస్తున్నారు. తాజాగా ఆయనకు తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. సోమవారం తన చాంబర్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు.




ఎన్. గిరిధర్‌రెడ్డి

గిరిధర్‌రెడ్డికి 'సెట్విన్'

జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లికి చెందిన నందారం గిరిధర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు. ఎంపీటీసీగా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి జహీరాబాద్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఇటీవలే ఐదేళ్ల గడువు పూర్తిచేసుకుని పదవీ విరమణ పొందారు. తాజాగా వెల్లడించిన రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల జాబితాలో గిరిధర్‌రెడ్డికి చోటు దక్కింది. సెట్విన్ సంస్థకు చైర్మన్‌గా నియమించారు. జంటనగరాల్లో ఉపాధి కల్పన, శిక్షణ తరగతులు అందించే కీలకమైన సొసైటీ ఇది. వ్యాపార రంగంలోనూ ఉన్న ఈయన... రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి తోడల్లుడు.



ఎం.ఏ ఫహీమ్



సిద్దిపేట, మెదక్ జిల్లాల నేతలకు నిరాశ..

సిద్దిపేట, మెదక్ జిల్లాలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ ఆశావహులకు ఈ జాబితాలో నిరాశ తప్పలేదు. ప్రకటించిన మూడు పదవులూ సంగారెడ్డి జిల్లాకే దక్కడంతో రెండవ జాబితాపై ఆశలు పెట్టుకున్నారు. గడిచిన పార్లమెంటు ఎన్నికల్లో సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాలతోపాటు మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లో కాంగ్రెస్ ఓటు బ్యాంకు పెరిగింది. అంతేకాకుండా బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏళ్ల తరబడిగా కాంగ్రెస్ పార్టీకి విధేయతను ప్రదర్శించినవారంతా పదవుల కోసం పోటీపడుతున్నారు. రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులతోపాటు కీలకమైన నామినేటెడ్ పదవులు దక్కుతాయని ఆశిస్తున్నారు.

కూతురు ప్రేమ వివాహం.. తండ్రి ఆత్మహత్య

దుబ్బాక, జూలై 8 : కుమార్తె ప్రేమ వివాహం చేసుకుని తమ నుంచి దూరమైందని ఆ తండ్రి మనోవేదనకు గురయ్యాడు. తిరిగి ఇంటికి తీసుకువచ్చేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన దుబ్బాక మండలం అచ్చుమాయిపల్లిలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోమారపు లింగం (40) కుమార్తె రెండు నెలల క్రితం పక్కగ్రామానికి చెందిన ఒక యువకుడిని ప్రేమవివాహం చేసుకుంది. అప్పటినుంచి మానసికంగా కుంగిపోయిన లింగం తన కుమార్తెను ఇంటికి తీసుకురావాలని గ్రామ పెద్దలకు పలుమార్లు విన్నవించాడు. కుమార్తెను ఇంటికి తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన లింగం తిరిగి రాలేదు. వెతకగా పొలం వద్ద వేప చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. లింగంకు భార్య రేణవ్వ, ఒక కూతురు, కుమారులున్నారు. దుబ్బాక ఎస్ఐ గంగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల ధర్నా

జగదేవ్‌పూర్, జూలై 8: తమ పాఠశాలకు అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థులు ఆందోళనకు దిగారు. సబ్జెక్టులకు సరిపడా ఉపాధ్యాయులు లేక బోధన సరిగా సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ.. సోమవారం బీజీ వెంకటాపూర్ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి మాజీ ఎంపీటీసీ కిరణ్‌గౌడ్, మాజీ సర్పంచ్ మంజుల రమేష్ జగదేవ్‌పూర్‌లోని ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఎంఐఎస్ గోవర్ధన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, నాయకులు మాట్లాడుతూ.. తమ గ్రామం లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు బోధిస్తున్నారని తెలిపారు. మొత్తంగా 32 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో సరైన బోధన అందడం లేదన్నారు. గతంలో కూడా ఇదే సమస్య ఉంటే తల్లిదండ్రుల సహకారంతో ప్రైవేట్ టీచర్‌ను నియమించుకుని పాఠశాలను కాపాడుకున్నామని తెలిపారు.ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి తమ పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా రెండురోజుల్లో ఉపాధ్యాయులను కేటాయిస్తామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.



ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజీ వెంకటాపూర్ విద్యార్థులు

ఘనంగా మహానేత జయంతి వేడుకలు

మహానేత వైఎస్ఆర్ జయంతిని జిల్లాలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు.

మరిన్ని వార్తలు 8లో..

గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు →



ఆదర్శంగా అభివృద్ధి చేస్తా..

- రీజనల్ రింగ్ రోడ్డు చుట్టూ రైలు మార్గం ఏర్పాటుకు కృషి
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

నర్సాపూర్/మెదక్ అర్బన్, జూలై 8: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని సెగ్మెంట్లను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంతో పాటు నర్సాపూర్ పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభల్లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ త్వరలో పూర్తిగా కనుమరుగవుతుందని, బీఆర్ఎస్ నేటి దుస్థితికి ఆ పార్టీ నేతల తీరే కారణమని విమర్శించారు. మెదక్ ఎంపీగా అసలు విజేతలు కార్యకర్తలు, ఓటర్లేనని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడం కోసం తన పరిధిలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికో కార్యాలయాన్ని ఏర్పాటుచేసి సిబ్బందిని అందుబాటులో ఉంచుతానని చెప్పారు. రీజినల్ రింగురోడ్డు వెంటనే రైలు మార్గం కోసం కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు. నర్సాపూర్‌కు రైలు రావాలనే కలను నిజం చేస్తానని ఆయన పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడం కోసం ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్‌యాదవ్, రఘువీరారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్న రమేష్ గౌడ్, అధికార ప్రతినిధి పెద్ద రమేష్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేస్‌యాదవ్, నర్సాపూర్ అసెంబ్లీ కన్వీనర్ రమణరావు, పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, కో కన్వీనర్ సతీష్‌యాదవ్, ఆయా మండలాల బీజేపీ అధ్యక్షులు నగేష్, రాకేష్, నాగప్రభు, రవి, నర్సింహులు, వేణు, కౌన్సిలర్లు యాదగిరి, లతరమేష్‌యాదవ్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్‌తో తదితరులు పాల్గొన్నారు. మెదక్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పరిణిత, నాయకులు నర్సింగరావు, ఎంఎల్ఎన్‌రెడ్డి, నందారెడ్డి, రాగిరాములు, అసెంబ్లీ కన్వీనర్ మధు, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్ పట్టణంలో నిర్వహించిన కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

ప్రసాద్ దర్శన్ స్కీం కింద ఏడుపాయల అభివృద్ధి

పాపన్నపేట : కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ దర్శన్ స్కీం కింద ఏడుపాయల క్షేత్రంలో శాశ్వత అభివృద్ధి పనులు చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. మెదక్ ఎంపీగా గెలిచిన అనంతరం తొలిసారి వనదుర్గామాత దర్శనానికి ఆయన సోమవారం వచ్చారు. రాజగోపురం నుంచి ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనవెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పరిణిత, జిల్లా మహిళా అధ్యక్షురాలు వీణ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పచ్చందనమే.. పచ్చదనమే..

- ఊరూరా వనమహోత్సవం
- 34 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ఇప్పటికి లక్ష్య సాధనలో 20 శాతం పూర్తి
- శాఖలవారీగా మొక్కల కేటాయింపు

మెదక్, జూలై 8: జిల్లాలో పచ్చదనమే లక్ష్యంగా వివిధశాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2015 నుంచి హరితహారం పేరిట కొనసాగుతున్న కార్యక్రమాన్ని ఈ ఏడాది నుంచి వనమహోత్సవం పేరిట నిర్వహించాలని రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. ఈ ఏడాది వనమహోత్సవంలో భాగంగా జిల్లావ్యాప్తంగా 34 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. శాఖలవారీగా లక్ష్యాలను రూపొందించాలని కలెక్టర్ నిర్దేశించారు. ఇందుకోసం వనమహోత్సవం కన్వీనర్‌గా జిల్లా అటవీ అధికారి రవిప్రసాద్‌ను నియమించారు. ఇప్పటికే 20 శాతం మొక్కలు నాటినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈమేరకు ప్రతీరోజు జిల్లాలో నాటిన మొక్కల వివరాలు రాష్ట్ర అధికారులకు పంపుతున్నారు.

6.96 లక్షల మొక్కలు

జిల్లాలో ఈ సంవత్సరం 34 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వనమహోత్సవం కన్వీనర్, జిల్లా అటవీశాఖ అధికారి రవిప్రసాద్ తెలిపారు. ఇప్పటివరకు 6.96 లక్షల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. సరిపడా వర్షాలు కురిసిన ప్రాంతాలలోనే మొక్కలు నాటుతున్నామని తెలిపారు. వర్షాలు లేనిచోట గుంతలు తీయడం కూడా ఇబ్బందిగానే ఉందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు.

ఊరికో నర్సరీ

జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామానికొకటి చొప్పున 469 నర్సరీలను ఏర్పాటు చేశారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 9 నర్సరీలను నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీల్లోనూ ప్రత్యేకంగా నర్సరీలను ఏర్పాటుచేసి మొక్కలను పెంచుతున్నారు. వనమహోత్సవంలో భాగంగా ఈసారి కొత్త ప్రదేశాల్లో మొక్కలు నాటాలని నిర్ణయించారు. జిల్లావ్యాప్తంగా 20 ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటలని నిర్దేశించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అత్యధికంగా 18 లక్షల మొక్కలు నాటుతున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 10 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. జిల్లాలోని తూప్రాన్, రామాయంపేట, నర్సాపూర్, మెదక్ మున్సిపాలిటీల పరిధిలో 3 లక్షల మొక్కలు నాటనున్నారు.



వీఐపీ ప్లాంటేషన్‌లకు గ్రామాల ఎంపిక

1950లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రస్తుతం 75 ఏళ్ల పూర్తవుతున్న సందర్భంగా వజ్రోత్సవ వనమహోత్సవం కార్యక్రమంగా నామకరణం చేసి వీఐపీ ప్లాంటేషన్ పేరిట ప్రత్యేక ప్రాంతాలను అధికారులు ఎంపిక చేస్తున్నారు. ఇందుకోసం ప్రతీ మండలం నుండీ రెండేసి గ్రామాలను గుర్తిస్తున్నారు. ప్రత్యేక వ్యక్తులు, మంత్రులు వివిధ హోదాలలో ఉన్నవారు జిల్లాకు విచ్చేసిన సందర్భంలో వారి చేతుల మీదుగా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఆర్‌డీఏ శ్రీనివాస్‌రావు తెలిపారు.

ప్రజావాణికి 31 దరఖాస్తులు

- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 8 : ప్రజల సమస్యలు వినేందుకు ప్రజావాణి చక్కని వేదిక అని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సత్వరంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కలెక్టర్ వినతులను స్వీకరించారు. మొత్తం 31 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణికి వచ్చే అర్జీదారులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే లోనికి అనుమతించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, ఇతర జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి



ప్రజావాణికి వచ్చే వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు

'డబుల్' ఇళ్లు ఇప్పిస్తానని మోసం

\- వజ్రవ్వ, అనురాధ, లత, రజిత

మేం సిద్దిపేటలోని కోటిలింగాల ఆలయం వద్ద కాలనీలో నివసిస్తున్నాం. చిన్నచిన్నపనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. ఆరునెలల క్రితం గండం ప్రసాద్, బాబూ పరిచయమై తాము కలెక్టర్‌లో ఉద్యోగం చేస్తామని, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తామని చెప్పి నమ్మించారు. మా నుంచి రూ.5లక్షల వరకు తీసుకుని స్పందించడం లేదు. మమ్మల్ని నమ్మించి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకుని మా డబ్బు మాకు ఇప్పించాలి.

వీఆర్ఏల వారసులకు న్యాయం చేయండి

61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగం అందించి ప్రభుత్వం న్యాయం చేయాలని వీఆర్ఏల సంఘం జిల్లా నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జీవో నెంబర్ 81, 85 ప్రకారం వారసులకు నియామక ఉత్తర్వులు అందించి తమ కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు.



ఇన్నోవేటర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రతి ఇంటి నుంచి ఒక ఆవిష్కర్త తయారవ్వాలి

- నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదికవ్వాలి : కలెక్టర్

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 8: ప్రతి ఇంటి నుంచి ఒక ఆవిష్కర్త తయారు కావాలని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదికగా నిలవాలని కలెక్టర్ సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో "ఇంటింటా ఇన్నోవేటర్" కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. చదువు, వయస్సుతో పనిలేదని, ప్రతిఒక్కరూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. విద్యాశాఖ అధికారులతో పాటు పలు శాఖల అధికారులు పాఠశాలలతో పాటు గ్రామాల్లో ఈ కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణుల ఆవిష్కరణ, విద్యార్థుల ఆవిష్కరణ, వ్యవసాయ రంగ ఆవిష్కరణలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలతోపాటు తదితర ఆవిష్కరణలను ప్రదర్శిస్తారని ఆయన తెలిపారు. వాటికి సంబంధించిన ప్రదర్శనకు గల రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు, 100 పదాలతో రాసి ఆసక్తి గల వారు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్ 9100678543 కు పంపాలని సూచించారు. వృత్తి, ఊరు పేరు, జిల్లా పేరుతో వివరాలను ఆగస్టు 5లోగా పంపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, ఈడీఎం ఆనంద్, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో వేలంపాటలు

చేర్యాల, జూలై 8 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో టెండర్ బాక్స్ ఓపెన్ చేశారు. స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తుల పాదరక్షలు, బ్యాగులు భద్రపరుచుకునే హక్కును పి.నవీన్ రూ.14.90 లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. గతేడాది రూ.13.54లక్షలు ఉండగా, ఈ సారి రూ.1.36 లక్షలు పెరిగింది. భక్తులు మొక్కుబడిగా వదిలిపెట్టిన కొబ్బరి ముక్కలు, ఒడిబియ్యం, పసుపు, తలనీలాలు, వస్త్రాలు పోగుతో పాటు ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయానికి సరైన పాట రాకపోవడంతో వాయిదా వేశారు. వీటికి త్వరలోనే వేలంపాటలు జరుపుతామని ఈవో బాలాజీశర్మ తెలిపారు.



టెండర్లు నిర్వహిస్తున్న ఆలయ ఈవో బాలాజీశర్మ తదితరులు



సీసీ కెమెరాల కంట్రోల్ యూనిట్

మల్లన్న ఆలయ ఆవరణలో పటిష్ట నిఘా

కొమురవెల్లి మల్లికార్జునస్వామి భక్తులపై ఇటీవల పలువురు యువకులు గంజాయి మత్తులో దాడికి పాల్పడిన నేపథ్యంలో పోలీసులు, ఆలయాధికారులు అప్రమత్తమయ్యారు. గతంలో ఆలయ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినా నిర్వహణాలోపంతో సరిగా పనిచేయడంలేదు. పలు ప్రదేశాలలో నిఘా కొరవడంతో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి సీసీ కెమెరాల మరమ్మతులు చేపట్టారు. ఆలయ పరిసరాల్లో 20, పోలీస్‌స్టేషన్ పరిధిలో 22 కెమెరాల ఏర్పాటుతో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. ఎస్ఐ రాజుగౌడ్ మాట్లాడుతూ.. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామన్నారు. అసభ్యంగా ప్రవర్తించినా, గంజాయి సేవించిన వారి వివరాలను పోలీసులకు తెలియజేయాలని ఆయన సూచించారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఇష్టారాజ్యం..!

- సమయపాలన పాటించని అధికారులు, సిబ్బంది
- పని నిమిత్తం కార్యాలయానికి వచ్చేవారిపై దురుసు ప్రవర్తన
- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

చిన్నకోడూరు, జూలై 8: చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం ఉదయం 10.40 గంటలవరకూ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఒక్కరూ రాకపోవడం గమనార్హం. ఆ తర్వాత నుంచి నెమ్మదిగా ఒక్కొక్కరు కార్యాలయానికి చేరుకున్నారు. దీంతో పని నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిరోజు మండలంలోని పలు గ్రామాల ప్రజలు కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. ప్రజలు భూ సంబంధిత, పలు సర్టిఫికెట్ల జారీ తదితర విషయాల గురించి కార్యాలయ సిబ్బందిని అడిగితే చెప్పకపోగా.. దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదేమిటని సిబ్బందిని నిలదీస్తే మీ దిక్కున్న చోట చెప్పుకొమ్మని తెగేసి చెబుతున్నారని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కార్యాలయ సిబ్బంది పనితీరుపై మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కార్యాలయ అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమయపాలన పాటించని, దురుసుగా ప్రవర్తిస్తున్న కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.




సోమవారం ఉదయం 10.40 గంటల వరకూ కార్యాలయానికి ఎవరూ రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

11 తర్వాత వస్తారు..

నేను పని నిమిత్తం ఇప్పటికీ మూడు, నాలుగుసార్లు కార్యాలయానికి వచ్చాను. కార్యాలయ అధికారులు, సిబ్బంది ఎవరూ సమయానికి రారు. నెమ్మదిగా ఉదయం 11 గంటల తర్వాత ఆఫీసుకు వస్తున్నారు. అప్పటి దాకా వేచి చూడాల్సిన పరిస్థితి. కార్యాలయ సిబ్బందిని ఏదైనా అడిగితే సరైన సమాధానం చెప్పకుండా దురుసుగా ప్రవర్తిస్తారు.

- రాజశేఖర్, ఓ గ్రామ యువకుడు

నా దృష్టికి రాలేదు

10, 15 నిమిషాలు అటుఇటుగా అందరూ సమయానికే కార్యాలయానికి వస్తారు. కార్యాలయానికి వచ్చేవారిపై సిబ్బంది దురుసుగా ప్రవరిస్తున్నారనే విషయం నా దృష్టికి రాలేదు. అలాంటివి ఏమైనా నా దృష్టికి వస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటాను. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటాను.

- జయలక్ష్మి, తహసీల్దార్, చిన్నకోడూరు

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

దుబ్బాక, జూలై 8: అనారోగ్యంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుబ్బాక మండలం ఆకారం గ్రామానికి చెందిన మొలంగురి భాస్కర్(25) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంటిని వెళ్లిన భాస్కర్ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు దుబ్బాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రామంలోని ఓ వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడికి భార్య శృతి, ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు.

పాముకాటుకు పాడిగేదె మృతి

చేర్యాల, జూలై 8: పాముకాటుకు గురై పాడిగేదె మృతిచెందిన సంఘటన సోమవారం చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన పోలోజు కృష్ణమూర్తికి చెందిన పాడి గేదె పొలంలో మేస్తుండగా పాముకాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కృష్ణమూర్తి కోరారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు..

చేర్యాల, జూలై 8: విద్యుదాఘాతంతో పాడి ఆవు సోమవారం మృతిచెందింది. కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన తాడూరి రాజయ్య తన వ్యవసాయ బావి వద్ద పాడి ఆవు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. నిత్యం రూ.15 లీటర్ల పాలు ఇచ్చే పాడి ఆవు మృతితో ఆధారం కోల్పోవడంతో పాటు రూ.90వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నాడు.

దుర్గమ్మ ఆలయంలో చోరీ

ధూళిమిట్ట, జూలై 8: ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం ఉదయం తాళం వేసి ఉన్న గుడి తలుపులు తీసి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో అమ్మవారి బంగారు ముక్కుపూడక, పుస్తెలతాడు చోరీకి గురైనట్లు గ్రామస్థులు తెలిపారు. చోరీకి గురైన ఆభరణాల విలువ సుమారు రూ.50 వేలు వరకు ఉంటుందన్నారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో చేర్యాల సీఐ శ్రీను మద్దూరు పోలీసులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి గ్రామస్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఫిర్యాదు అందలేదనీ, అందిన వెంటనే కేసు నమోదు చేసి విచారణ చేస్తామని తెలిపారు.

ఒడిబియ్యం, పూలదండల సరఫరాకు బహిరంగ వేలం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న ఈవో అన్నపూర్ణ

వర్గల్, జూలై 8: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి అమ్మేందుకు, ఒడిబియ్యం పోగు చేసుకునేందుకు, ప్రతిరోజు ఆలయానికి పూల దండలు సరఫరా చేసేందుకు సోమవారం ఆలయం వద్ద ఆలయ కార్యనిర్వహణాధికారి నేతృత్వంలో సీల్డ్ టెండర్‌తో పాటు బహిరంగ వేలం నిర్వహించారు. ఒడిబియ్యం పోగు చేసుకునేందుకు హైదరాబాద్‌కు చెందిన రాహుల్‌యాదవ్ రూ.1.75లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. అలాగే స్వామివారికి, అమ్మవారితో పాటు ఉపాలయంలో ఉన్న దేవతామూర్తులకు తక్కువ ధరకు పూలదండలు, అలంకరణకు పూలు సరఫరా చేయుటకు గజ్వేల్ చెందిన నరేందర్ వేలం పాటలో కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు సుధాకర్, నరేందర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్‌లో అంబిటస్ విద్యార్థుల ప్రతిభ

- మూడు రాష్ట్రస్థాయి ర్యాంకులు కైవసం

సిద్దిపేట క్రైం, జూలై 8: జాతీయస్థాయిలో గత డిసెంబరు 2023-24 సంవత్సరానికిగానూ నిర్వహించిన ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ టెస్ట్‌లో అంబిటస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ టెస్టులో విద్యార్థులు మూడు రాష్ట్రస్థాయి ర్యాంక్‌లతోపాటు, 6 ఎక్సలెన్స్ అవార్డులను సొంతం చేసుకున్నారు. అలాగే 50 మంది విద్యార్థులు మెడల్స్ గెలుచుకోగా, 158 మంది విద్యార్థులు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను సాధించారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం పట్ల కరస్పాండెంట్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎడ్ల జ్యోతిశ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ విజయభాస్కర్ హర్షం వ్యక్తం చేశారు.

భూమి కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ తారీఖ్ అన్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహేశ్

చేర్యాల, జూలై 8: కొండపోచమ్మ ఆలయం ఎదురుగా ఉన్న చేర్యాల మండలం నాగపురి గ్రామ నల్లపోచమ్మ చెరువును కబ్జా నుంచి కాపాడి, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని నల్లపోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గూడెపు మహేశ్ సోమవారం తహసీల్దార్ తారీఖ్ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. సర్వే నెంబరు 831లో 22.02 ఎకరాల భూమి, ఎఫ్‌టీఎల్ 13 ఎకరాల భూమిలో పలువురు రియల్టర్లు దర్జాగా కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టారన్నారు. గతంలో ఉమ్మడి వరంగల్, మెదక్ జిల్లాల ఏడీల సమక్షంలో హద్దులు నిర్ధారించినా పలువురు ఉల్లంఘించి కబ్జాచేయడంతో చెరువు ఉనికికి ప్రమాదం నెలకొందని పర్కొన్నారు. వెంటనే శిఖం, ఎఫ్‌టీఎఫ్‌లో అక్రమ నిర్మాణాలు కూల్చి చెరువు కాపాడాలని కోరారు. ఆయనవెంట ధర్మకర్తల ఆరుట్ల వినీత్‌ఉన్నారు.

నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టాలి

- పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహాచారి



అధికారికి ఫిర్యాదు చేస్తున్న డైరెక్టర్ నరసింహాచారి

కుకునూరుపల్లి, జూలై 8: పల్లె ప్రకృతి వనం నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహాచారి సోమవారం గ్రామపంచాయతీలో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె ప్రకృతివనానికి సంబంధించి రూ.4.60 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధుల వివరాల గ్రామపంచాయతీలో లేదని, వీటిపై సమాచారం తమకు తెలియదని అధికారులు సమాధానం ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వీరేశం, కాంగ్రెస్ నాయకులు సుదర్శన్‌చారి పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల్లో పేర్లు నమోదుపై తప్పుడు ప్రచారం

రాయపోల్, జూలై 8: కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం ఫేక్ అని రాయపోల్ తహసీల్దార్ దివ్య పేర్కొన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు. కొత్త రేషన్‌కార్డులు, పాత కార్డుల్లో పెళ్లయిన వారి పేర్లు నమోదు, పిల్లల పేర్లను నమోదు చేయడం కోసం ఎలాంటి ఆప్షన్లు రాలేదని స్పష్టం చేశారు. వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మి మీసేవల వద్దకు వెళ్లవద్దని హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చినా వెంటనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

కుకునూరుపల్లి, జూలై 8: కుకునూరుపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2014-15లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి, కిరణ్ రామచంద్రారెడ్డి, మల్లేశం, జనార్దన్, కనకలక్ష్మిని సన్మానించారు.

డంపింగ్‌యార్డును పరిశీలించిన కమిషనర్

గజ్వేల్, జూలై 8: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డంపింగ్‌యార్డును మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య సోమవారం పరిశీలించారు. గజ్వేల్ పట్టణంలోని డంపింగ్‌యార్డులో మొక్కలను, తడి, పొడి చెత్త వేరు చేసే షెడ్‌ను, కంపోస్టు షెడ్‌ను, డీఆర్‌సీసీ(డ్రై రీసోర్స్ సెంటర్)ను పరిశీలించారు. ఆయనవెంట మునిసిపల్ ఏఈ శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వెదసాగు పైర్ల పరిశీలన

మర్కుక్, జూలై 8: మండలంలోని పలు గ్రామాల్లో వెదసాగు పద్ధతిలో వేసిన వరిపైర్లను మండల వ్యవసాయాధికారి డా. టి.నాగేందర్‌రెడ్డి పొలాల దగ్గరికి వెళ్లి పరిశీలించి, రైతులతో మాట్లాడారు. వరిలో విత్తనం వెదజల్లే పద్ధతిలో రైతాంగానికి అనేక లాభాలు ఉన్నాయన్నారు. నారుమడి పద్ధతిలో ఎకరానికి 25-30 కేజీల విత్తనం అవసరం ఉంటుందని తెలిపారు. వారితో పాటుగా వ్యవసాయ విస్తరణ అధికారి రజనీకాంత్, రైతులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రచారం పట్ల అప్రమత్తంగా ఉండాలి: సీఐ

చేర్యాల, జూలై 8: సోషల్ మీడియాలో జరిగే ప్రచారంతో పాటు సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని చేర్యాల సీఐ ఎల్.శ్రీను అన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో సోమవారం ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, షీ టీమ్స్ ఇతరత్రా అంశాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెదలుతూ చదువులో రాణించాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు కానీ, లింక్ మెసేజ్‌లకు స్పందించొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి ఎస్‌ఐ రాజుగౌడ్, కస్తూర్బా ప్రత్యేకాధికారి నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ప్రజా ప్రతినిధులకు ఘనంగా సన్మానం

కోహెడ, జూలై 8: మండలంలోని శనిగరం గ్రామంలో మాజీ ప్రజాప్రతినిధులకు సోమవారం ఘనంగా సన్మానం చేశారు. మాజీ జడ్పీటీసీ శ్యామలామధుసూదన్‌రావు, మాజీ సర్పంచ్ కర్ర జయశ్రీరవీందర్, మాజీ ఎంపీటీసీ కొంపల్లి స్వప్న శశిధర్‌లకు పంచాయతీ కార్యదర్శి చంద్రం ఆధ్వర్యంలో శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాదె శ్రీధర్, డీఈఈ చక్రం శంకర్, మాజీ ఉపసర్పంచ్ దావాశివపార్వతి శేఖర్, మాజీ కో ఆప్షన్ సభ్యులు రహీం, గొంటి కనకయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, ప్లేట్లు అందజేత

దౌల్తాబాద్, జూలై 8: దౌల్తాబాద్ మండల పరిధిలోని ఇందుప్రియల్ గ్రామంలో పోతరాజు రవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం ఆయన దశ దినకర్మ సందర్భంగా గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం చేయడానికి ప్లేట్లు, నోటు బుక్స్, పెన్నులు అందజేశారు.

14వ వార్డులో సెల్‌టవర్ పనులు ఆపాలి

సదాశివపేట, జూలై 8: పట్టణంలోని 14వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఓ సెల్ టవర్ పనులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ సోమవారం వార్డు ప్రజలు పెద్దసంఖ్యలో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వార్డులో ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించేలా పాఠశాల, ఆలయాలు, ప్రార్థన మందిరాలకు అత్యంత సమీపంలో సెల్ టవర్ నిర్మించడం సరికాదని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన అదనపు కలెక్టర్ వెంటనే వివరణ ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజల అభ్యంతరం ఉన్న టవర్ పనులను నిలిపివేయాలని తెలిపారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- బీజేపీ కిసాన్‌మోర్చా నాయకుల డిమాండ్



గజ్వేల్ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్/కుకునూరుపల్లి/దుబ్బాక/చేర్యాల, జూలై 8: రైతులకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకుల డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తుగారి తిరుమల్‌రెడ్డి ఆదేశాల మేరకు గజ్వేల్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపి, అనంతరం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా గజ్వేల్ పట్టణ, మండల అధ్యక్షులు సంగెం కరుణాకర్, పంజా బాలుతో కలిసి సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మార్కంటి ఏగొండ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఆరు మాసాలు గడుస్తున్నా నెరవేర్చలేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని, రైతులకు ఫసల్ బీమా యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయడం లేదన్నారు. వారితో బీజేపీ సీనియర్ నాయకులు ఉప్పల మధుసూదన్, గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ కో-కన్వీనర్లు ఎలుకంటి సురేష్, మహేష్, ఎస్సీ మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, గజ్వేల్ పట్టణ, మండలాధ్యక్షులు మనోహర్‌యాదవ్, పంజాల అశోక్ తదితరులున్నారు. కుకునూరుపల్లిలో బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ, మండలాధ్యక్షుడు గుర్రాల స్వామి, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. దుబ్బాకలో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పంట రుణమాఫీ రూ.2 లక్షలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మోర్చా కొమురవెల్లి మండల నాయకులు సోమవారం కొమురవెల్లి తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. నాయకులు బచ్చల చంద్రం, నరెడ్ల నరేందర్‌రెడ్డి, గుర్రాల రాములు పాల్గొన్నారు.

మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్ టౌన్/ములుగు, జూలై 8: మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. సోమవారం ఆమె హుస్నాబాద్ పట్టణంలోని 10వ వార్డులో జరిగిన వనమహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కల పెంపకంతో వాతావరణ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గోవిందు రవి, అయిలేని శంకర్‌రెడ్డి, శంకర్, రవికుమార్ పాల్గొన్నారు. వన మహోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని కొక్కొండ స్పెషల్ ఆఫీసర్ రామచంద్రారావు కోరారు. సోమవారం ములుగు మండలం కొక్కొండలో గ్రామస్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని జీపీ కార్మికుల ధర్నా

- కలెక్టర్ హామీతో ధర్నా విరమణ



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

సిద్దిపేట అర్బన్, జూలై 8: గ్రామపంచాయతీ సిబ్బందికి 10 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు గ్రీవెన్స్ సెల్‌కు ఆటంకం కలిగించడంతో కలెక్టర్ కలగజేసుకొని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు ఎల్లయ్య, సహాయ కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని అన్నారు. జిల్లావ్యాప్తంగా 499 గ్రామపంచాయతీల్లో సుమారు 2,500 మంది కార్మికులకు పది నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా సందర్భంగా భారీ గేట్లు నెట్టుకుంటూ వెళ్తున్న నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి మహేష్, అధ్యక్షుడు కొమరయ్య, కోశాధికారి రాజనర్సు, కార్మికులు శంకరయ్య, రాజమల్లు ,మల్లయ్య, సమ్మయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు



మాట్లాడుతున్న బండారు శ్రీకాంత్‌రావు

ములుగు, జూలై 8: రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన ములుగులో విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే రైతులకు రుణమాఫీ చేయడమే కాకుండా రైతుభరోసా నిధులు కూడా విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదన్నారు. ఈ సమావేశంలో అడ్వకేట్ గోపాల్‌రావు, నాయిని యాదగిరి, మల్లారెడ్డి, మాజీ సర్పంచులు భూపాల్‌రెడ్డి, భానుప్రకాష్‌రావు, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

అంగన్‌వాడీలలో గ్రోత్ మేళా



సిబ్బితండా అంగన్‌వాడీ సెంటర్లో పిల్లల ఎత్తు, బరువులను కొలుస్తున్న టీచర్

ధూళిమిట్ట/సిద్దిపేట అర్బన్, జూలై 8: మండలంలోని హనుమతండా గ్రామపంచాయతీ పరిధిలోని సిబ్బితండాలో, బైరాన్‌పల్లి గ్రామంలోని రెండవ అంగన్‌వాడీ సెంటర్లో సోమవారం గ్రోత్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు మాట్లాడుతూ చంటి పిల్లల తల్లులు పిల్లలను వయస్సుకు తగ్గ బరువు ఉండే విధంగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ధరావత్ శారద, స్వరూప, ఏఎన్ఎంల జ్యోతిరాణి, ఆశా కార్యకర్తలు, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం గ్రోత్ మేళా నిర్వహించారు. ఏఎన్ఎం పద్మావతి, పంచాయతీ కార్యదర్శి గీత అంగన్‌వాడీకి వచ్చే తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు గ్రోత్ మేళాపై అవగాహన కల్పించారు.

బీఆర్ఎస్‌కు దయానంద్‌రెడ్డి రాజీనామా

జగదేవ్‌పూర్, జూలై 8: జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బట్టు దయానందరెడ్డి సోమవారం ఆ పార్టీకి రాజీనామా చేశాడు. రాజీనామా పత్రాన్ని గ్రామ అధ్యక్షుడు నాగేలి శ్రీనివాస్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా దయానందరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో క్రియాశీలక పాత్ర పోషిస్తూ పార్టీ బలోపేతానికి కష్టపడినట్లు వివరించారు. కేసీఆర్ నియోజకవర్గం అయినా పలుమార్లు రైతుల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అందుకే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

త్రిపుల్ ఐటీ సీట్ల సాధనలో సిద్దిపేటదే మొదటిస్థానం

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య



విద్యార్థులను సన్మానిస్తున్న బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు

నారాయణరావుపేట, జూలై 8: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో బాసర త్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడంలో మన సిద్దిపేట విద్యార్థులు రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య అన్నారు. సోమవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషికి దగ్గ ఫలితం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలకృష్ణ, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో పాతిన బోర్డు తొలగింపు

కొండపాక, జూలై 8: కొండపాక మండలం ఖమ్మంపల్లి గ్రామంలో కబ్జాగురైన ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించి, సర్వే అనంతరం ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు. ఆ బోర్డులను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం కనబడకుండా చింపివేశారు. ఈ చర్యకు పాల్పడింది కబ్జాకు పాల్పడిన వారేనని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పేదల పక్షపాతి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటేరు నరేందర్‌రెడ్డి
- పలు మండలాల్లో వైఎస్సార్ జయంతి



హుస్నాబాద్: వైఎస్సార్ చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్, జూలై 8: పేదల పక్షపాతి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సర్దార్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు మోహన్నగారి రాజు, ప్రధాన కార్యదర్శి రాములుగౌడ్‌తో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●కుకునూరుపల్లి: కుకునూరుపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల వీరేశం, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

●ములుగు: ములుగు మండలం వంటిమామిడి గ్రామంలో వైఎస్సార్ 75వ జయంతిని నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ గజ్వేల్ నియోజకవర్గ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడారు.

●ధూళిమిట్ట: మండల కేంద్రంలో వైఎస్సార్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కోల సాయిలుగౌడ్, బెక్కల్ దేవస్థానం చైర్మన్ చొప్పరి మల్లేశం, డైరెక్టర్లు పాల్గొన్నారు.

●కోహెడ: కోహెడ మండల కేంద్రంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ధర్మయ్య నారాయణగౌడ్ పాల్గొన్నారు.

●మద్దూరు: మద్దూరులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మేక మల్లేశం ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. జిల్లా నాయకులు కామిడి జీవన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, మహిళా అధ్యక్షురాలు లలిత పాల్గొన్నారు.

●దుబ్బాక/మిరుదొడ్డి: దుబ్బాక మున్సిపాలిటీలోని చెరుకు శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, నాయకులు మచ్చ శ్రీనివాస్, ఆకుల దేవేందర్, ఐరేణి సాయికుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

●వర్గల్: వర్గల్ మండల కేంద్రంలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ మోహన్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

●కొండపాక: కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లింగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

●హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు.

●చేర్యాల: మాజీ సీఎం వైఎస్సార్ జయంతిని సోమవారం చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.